క్లుప్తంగా

ముదిరాజ్ రాష్ట్ర కార్యదర్శిగా అయిజవాసి



అయిజ: తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా అయిజ పట్టణానికి చెందిన న్యాయవాది జలగరి అశోక్ నియమితులయ్యారు. ఆదివారం రాత్రి నిర్వహించిన మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు చప్పరి శంకరముదిరాజ్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం పలువురు ప్రముఖులు జలగరి అశోక్‌ను అభినందించారు.

ఒరిగిన విద్యుత్ స్తంభం



మానవపాడు: విద్యుత్ స్తంభలు ఒరిగి ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని స్థానికులు భయందోళన చెందుతున్నారు. మండల కేంద్రం నుంచి గోకులపాడుకు వెళ్లే రహదారిలో విద్యుత్ స్తంభం ఒరిగి ప్రమాదకరంగా మారింది. ఈదురు గాలులు, వర్షాలకు స్తంభం నేలకు ఒరిగే ప్రమాదం ఉంది. ప్రమాదం జరుగకముందే విద్యుత్ స్తంభాలను సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

వీధిలైట్లు వెలగక అంధకారం



కేటీదొడ్డి: గత కొన్ని రోజులుగా మండలంలోని వివిధ గ్రామాల్లో వీధిలైట్లు వెలగకపోవడంతో మండల ప్రజలు అంధకారంలో మగ్గుతున్నారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలోని వీధిలైట్లకు మరమ్మతు చేయాలని కార్యదర్శులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వీధిలైట్లకు మరమ్మతు చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పరమశివుడికి ప్రత్యేక అభిషేకాలు



మానవపాడు: మండలంలోని పెద్దఆముదాలపాడు గ్రామంలో సోమవారం వర్షాల కోసం పరమశివుడికి ప్రత్యేక జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా తుంగభద్ర, కృష్ణానది జలాలతో శివాలయంలో జలాభిషేకం నిర్వహించి ఉపవాస దీక్షలతో పూజలు చేశారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి



మానవపాడు: రోడ్డు భద్రతా నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్‌ఐ చంద్రకాంత్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని జాతీయ రహదారి వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. వాహనదారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడమే ప్రమాదానికి కారణమన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని ఆదేశించారు. మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భాగవత పారాయణ మహాయజ్ఞం



ఎర్రవల్లి: మండల కేంద్రంలోని శివాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం భాగవత పారాయణం మహాయజ్ఞం వైభవంగా కొనసాగింది. ఈ సందర్భంగా నాల్గవ రోజు వికాస తరంగిణి, విశ్వ హిందూ పరిషత్, ధర్మప్రసార సమితి సంఘాల కమిటీ సభ్యులు, అర్చకులు మద్భవద్గీత సప్తాహ పారాయణాన్ని వేదమంత్రాల నడుమ కంఠస్తం చేశారు. అందులో భాగంగా ప్రహ్లాద వృత్తాంతం,గజేంద్ర మోక్షం తదితర కథలతో పాటు భక్తి, శ్రద్ధ, సనాతన ధర్మం గురించి భక్తులకు వివరించారు. అర్చకులు జయసింహ,రవీంద్ర,నర్సింహ, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు!

- యూరియా అందుబాటులో లేక ఆందోళన
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు



ధరూరులోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో ఉన్న ఎరువులు

ధరూరు:మండలంలో యూరియా కొరత రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది.మండల కేంద్రమైన ధరూరులో ఫర్టిలైజర్ దుకాణాల్లో యూరియా కృత్తియ కొరత సృష్టిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు మండల రైతులు.

ఇతర మందులు కొంటేనే

మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సరిపడేంత యూరియా అందుబాటులో ఉన్నా.. రైతులకు యూరియా లేదంటూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. కేవలం యూరియా కోసం వచ్చిన రైతులకు ఇతర కాకుండా 28028, 19.19.19 తదితర గట్టి మందులు కొన్న వారికే యూరియా విక్రయిస్తున్నారని రైతులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో వరి 20 వేల ఎకరాల్లో, పత్తి సుమారు 10 వేల ఎకరాల్లో పత్తి సాగు చేపట్టారు. ఖరీఫ్ వరి పంట ప్రారంభంతో పాటు పత్తి పంటలకు యూరియా అవసరమవుతోంది.

సీడ్‌పత్తి రైతుల ఆందోళన

యూరియా కృత్తిమ కొరత కారణంగా ముఖ్యంగా సీడ్‌పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. మొగ్గలు తీసే సమయం కావడంతో యూరియా అందుబాటులో లేక అవస్థలు పడుతున్నట్లు వాపోతున్నారు. మొక్క పెరిగేందుకు యూరియా వేయాలని పేర్కొంటున్నారు. వరినారు సమయంలో కూడా యూరియా వేయాలని పేర్కొంటున్నారు. డీలర్లను ప్రశ్నిస్తే మార్కెట్ లభ్యత తక్కువగా ఉందని చెబుతున్నట్లు వాపోతున్నారు.

పట్టించుకోని అధికారులు

మండలంలో యూరియా కృత్తిమ కొరత సృష్టిస్తున్నా వ్యవసాయ శాఖ అధికారులు పట్టించోవడం లేదని మండల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా ఇదే సమస్య ఎదురవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కొరత లేదు

మార్కెట్‌లో యూరియా కొరత లేదు.ధరూరులో పీఏసీఎస్, ఎర్‌ఎస్‌కే,గ్రోమోర్‌లలో యూరియా అందుబాటులో ఉంది.కావాల్సిన రైతులు అక్కడ తీసుకోవచ్చు.యూరియా ఉండి కూడా రైతులకు ఇవ్వని డీలర్లపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటాం.

– శ్రీలత, ఏఓ, ధరూరు

అందుబాటులో ఉంచాలి



రెండెకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నాను. సీడ్‌పత్తి మొగ్గలు తీసే సమయం అయ్యింది. చేను పెరగలేదని యూరియా పెడదామని ఫర్టిలైజర్ షాపులకు వెళ్తే యూరియా లేదంటున్నారు. రైతులకు ప్రస్తుతం అవసరమవుతున్న యూరియా ధరూరులో ఉండి ఇవ్వడం లేదో లేక లేకనే ఇస్తలేరో అర్థమవడం లేదు.

– రైతు జయ్యన్న, ధరూరు

ఉన్నా.. ఇవ్వడం లేదు



ఫర్టిలైజర్ దుకాణాల్లో యూరియా ఇవ్వడం లేదు. మండలంలో ఏటా ఇదే పరిస్థితి ఉంటుంది. గట్టి మందులు కొంటేనే యూరియా ఇస్తామని, కేవలం యూరియా ఇవ్వమని డీలర్లు బహిరంగంగానే చెబుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకొని రైతులకు యూరియా అందుబాటులో ఉండేలా చూడాలి.

– రైతు ఆనంద్‌రెడ్డి, బూరెడ్డిపల్లి

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూలులోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి చెక్కులను సోమవారం ఎమ్మెల్యే అందజేశారు. అలంపూర్ మండలం కాశీపురం గ్రామానికి చెందిన వడ్ల వీరాచారికి రూ.45 వేలు, కకెందిన దేవమ్మకు రూ.18 వేలు మంజూరైనట్లు తెలిపారు. అదే విధంగా ఇటిక్యాల మండలం సాతర్ల గ్రామానికి చెందిన రాముడుకు రూ.58 వేల చెక్కు వచ్చినట్లు పేర్కొన్నారు.

ఆరోగ్యంపై విద్యార్థులు శ్రద్ధ వహించాలి



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అలంపూర్: ఆరోగ్యంపై విద్యార్థులు శ్రద్ధ వహించాలని మండల వైద్యాధికారి భరత్ సూచించారు. పట్టణంలోని బాలికల హాస్టల్‌లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం 127 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. వారిలో 13 మంది విద్యార్థులు అనారోగ్యంతో ఉండటంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. విద్యార్థులు సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమల వ్యాప్తితో మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వ్యాధుల లక్షణాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ సత్యనారయణ, హెల్త్ అసిస్టెంట్లు శ్యామల, సురేఖ, బాలీశ్వరయ్యశెట్టి, హస్టల్ వార్డెన్ సౌజన్య, ఆశా కార్యకర్తలు పద్మా, పద్మావతి, జయమ్మ, శివలింగమ్మ, విజయమ్మ, ప్రేమలీల, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి



మిట్టదొడ్డిలో బీఆర్‌ఎస్ నాయకుల ర్యాలీ

గట్టు: స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమంతునాయుడు కోరారు. ఆదివారం రాత్రి మిట్టదొడ్డి గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హనుమంతునాయుడు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను నమ్మించి, అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపైనే ఉందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామన్నారు. కార్యకర్తలు, నాయకులు కలసి కట్టుగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేంద్రరెడ్డి, మోనేష్, రాజారెడ్డి, నాగరాజుశెట్టి, రాము నాయుడు, సోమశేఖర్‌రెడ్డి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్‌కు ఘన నివాళి



ఉస్మాన్ వర్ధంతిలో వ్యాయామ ఉపాధ్యాయులు

గద్వాలటౌన్ : విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ ఉస్మాన్ వర్ధంతి కార్యక్రమం సోమవారం ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి డీవైఎస్‌ఓ జితేందర్, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్రీడల అభివృద్ధికి, క్రీడాకారుల అభ్యున్నతికి ఉస్మాన్ చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వీరవసంతరాయుడు, ప్రభాకర్, అబ్రహం, విజయబాబు, మోహన్, ప్రకాష్, నగేష్ బాబు, హైమావతి, బీసన్న, సతీష్, విజయ్, నర్సింహ, రైల్వే పాష తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సప్తాహ భజనలు



మల్దకల్: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సప్తాహ భజనలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం మండలంలోని బిజ్వారం, ఈదులపల్లి, చర్లగార్లపాడు, ఆరగిద్ద గ్రామాలకు చెందిన భజన మండలి సభ్యులు సప్తాహ భజనల్లో పాల్గొన్నారు. వారం రోజుల పాటు కొనసాగనున్న భజనల్లో మండలి సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆయల అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు అరవిందరావు, చంద్రశేఖర్ రావు, అర్చకులు మధుసూదనాచారి, రవిచారి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పడకేసిన పారిశుద్ధ్యం



సాతర్లలో రోడ్డుపక్కనే పేరుకుపోయిన చెత్త

ఇటిక్యాల: గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలనలో కనీసం చెత్తచెదారాన్ని తొలగించడం లేదని మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని సాతర్ల గ్రామంలో ఎక్కడ చూసిన చెత్తచెదారం, మురుగు విచ్చలవిడిగా పేరుకుపోవడంతో ఈగలు, దోమల బెడద ఎక్కువైందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీజనల్ వ్యాధుల కాలం కావడంతో విషజ్వరాలతో అల్లాడుతున్నట్లు వాపోపుతున్నారు. వీధిదీపాలు రోజుల తరబడి వెలగడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నాతాధికారులు స్పందించి పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సబ్ స్టేషన్‌లో మరమ్మతు.. నిలిచిన సరఫరా



అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో సోమవారం మరమ్మతు పనులు చేపట్టారు. సబ్ స్టేషన్ నిర్వాహణలో భాగంగా పనులు చేపట్టినట్లు ఏడీఈ నవీన్‌బాబు తెలిపారు. అదే విధంగా అలంపూర్ చౌరస్తాలోని 11 కేవీ విద్యుత్ స్తంభాల కొత్తవి ఏర్పాటు చేశామన్నారు. ఈ నేపథ్యంలో స్టేషన్ పరిధిలో నాలుగు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు పేర్కొన్నారు.

ఆహార అలవాట్లు మార్చుకోవాలి



తుమ్మలచెరువులో పరీక్షలు చేస్తున్న వైద్య బృందం

గట్టు: ఆరోగ్యకరమైన జీవితం ఆహారపు అలవాట్లను మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైద్యాధికారి మురళీ సూచించారు. సోమవారం పెంచికలపాడు, తుమ్మలచెరువు గ్రామాల్లో భవిష్య భారత్, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ షుగర్ వ్యాధిగ్రస్తులు మూడు నెలలకోసారి షుగర్, బీపీ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. షుగర్ నియంత్రణకు సరైన పౌష్టికాహారం తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సు రాగిణి, ఫార్మసిస్ట్ జిలాని, సీఓ హలీంపాష, ఆశా వర్కర్లు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జునఖర్గే జన్మదిన వేడుకలు



గద్వాలలో వేడుకలను నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గద్వాలటౌన్: ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీపై కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కుట్ర పన్నుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, నారాయణరెడ్డి, తిరుమలేష్, మధుసూధన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల ఆధ్వర్యంలో

ఎర్రవల్లి: జింకలపల్లిస్టేజీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు కొప్పుల లక్ష్మీనారాయణరెడ్డి, జోగులరవి, సోమిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు కాశపోగు శేఖర్, జయ్యన్నల ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బోరవెల్లి మద్దిలేటి, శ్రీనివాసులు, నాగరాజు, పెద్ద సుంకన్న, నరసింహ, లక్ష్మన్న, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తోంది



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

ఎర్రవల్లి: కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తుందని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు మణికుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేను బీసీ ప్రధానిని కాబట్టే ప్రతిపక్షాలు నాపై తీవ్ర విమర్శలు చేస్తున్నాయని చెప్పుకునే మోదీ నేటి వరకు బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ఎందుకు తీసుకురాలేదో చెప్పాలన్నారు. బీజేపీ కేంద్రంలో అధికాంలోకి వచ్చి మూడు పర్యాయాలు అయినప్పటికీ చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ల గురించి మాట్లాడకపోవడం వారిని విస్మరించినట్లే అని మండిపడ్డారు. కేంద్రం నేటి వరకు బీసీ లెక్కలు తేల్చకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. వెంటనే బీసీల జనగణనపై చర్చ చేపట్టాలన్నారు. కేంద్రం చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లు తీసుకొచ్చి బీసీ సామాజిక వర్గానికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాముడు, శాంతిరాజు, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మతల్లి పండుగ

- చండీయాగం, బోనాల ఊరేగింపు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

ఖిల్లాఘనపురం: మండలకేంద్రంలోని బెస్తగేరిలో ఉన్న గంగమ్మ ఆలయం దగ్గర అమ్మవారి పండుగను కనులపండుగగా నిర్వహించారు. అమ్మవారిని ప్రతిష్ఠించి మూడేళ్లు కావడంతో సోమవారం వార్షికోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. ఛండీయాగం. అమ్మవారి పల్లకీసేవ, శివపార్వతుల కల్యాణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బోనంలో అమ్మవారికి నైవేద్యం తీసుకెళ్లారు. వీధులగుండా మహిళలు ఆలయం దగ్గరకు ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ మాజీ సర్పంచులు, పెద్దలు, యువకులు, మహిళలు పెద్దసంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొన్నారు.

పొగాకు సాగుకు అనుమతివ్వాలి

ఉండవెల్లి: పొగాకు సాగుకు అనుమతి ఇవ్వాలని మండలంలోని డి.బూడిదపాడు వద్ద గల ప్రైవేట్(వీఎస్‌టీ) కంపెనీ సిబ్బంది రామచంద్రారెడ్డికి రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు సోమవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం సభ్యులు మాట్లాడుతూ.. డి.బూడిదపాడు గ్రామంలో గతంలో పొగాకు కంపెనీ పంట సాగు చేయించి కొనుగోలు చేసిందన్నారు. ప్రస్తుతం పొగాకు సాగుకు అనుమతులు ఇవ్వడం లేదన్నారు. పొగాకు కంపెనీ గ్రామంలో ఉన్నప్పటికీ గ్రామ రైతులకు అనుమతులు ఇవ్వకుండా ఇతర గ్రామాల వారికి అనుమతులు ఇవ్వడం సరికాదన్నారు. పంట సాగు, కొనుగోలుకు అనుమతులు ఇవ్వాలని వినతిప్రతం అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కోటిరెడ్డి,బుచ్చిరెడ్డి, వెంకటేశ్వర్లు, రవి, నాగార్జున, చిన్న నాగేంద్ర, శ్రీను, గోవిందు, మద్దిలేటి పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ప్రతిభ చూపిన క్రీడాకారులు

మక్తల్: హైదరాబాద్‌లోని బండ్లగూడ, నాగోల్ వాటర్ గ్రౌండ్‌లో ఈ నెల 20న జరిగిన అస్మిత ఖేల్ ఇండియా ఉమెన్స్ రోడ్ స్పీడ్ స్కెక్లింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో నారాయణపేట జిల్లాకు చెందిన 150 మంది పాల్గొనగా 79 మంది జాతీయ స్థాయికి ఎంపికయ్యారని జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలం తెలిపారు. ఆగస్టు చివరి వారంలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో వారు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పీఈటీలు పుష్ప, శిల్ప, లావణ్య, మంజుల, త్రివేణి, పవిత్ర, దివ్య, అనూష, గిరిజ, మల్లేశ్వరి, అంకిత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే బీజేపీకి వెన్నముక



వడ్డేపల్లిలో మాట్లాడుతున్న రాజగోపాల్

అయిజ: కార్యకర్తలే బీజేపీకి వెన్నముక అని బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కార్యర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌రెడ్డి మాట్లాడారు. బూత్‌స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని, కొత్త వారిని పార్టీలో చేర్చుకోవాలని కార్యర్తలకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి బీజేపీ కార్యకర్త ఒక సైనికుడై పార్టీ విజయం కోసం పోరాడాలన్నారు. బీజేపీలో చేరితే ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు రావని కొందరు నాయకులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సంక్షేమ పథకాలు ఇవ్వకుంటే ప్రభుత్వంతో బీజేపీ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రదీప్‌కుమార్, పట్టణ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, కార్యర్తలు నాగరాజు, రఘు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

రాజోళి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు గెలిచి బీజేపీ సత్తా చాటుదామని పార్టీ సీనియర్ నాయకుడు రాజగోపాల్ అన్నారు. సోమవారం మండల కేంద్రం వడ్డేపల్లిలో మండల అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్వహించిన కార్యాచరణ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ.. బడ్జెట్‌ను నేరుగా గ్రామ పంచాయతీలకు కేటాయించి, గ్రామాల అభివృద్ధికి బీజేపీ కృషి చేసిందన్నారు. వైకుంఠదామాలు, ప్రకృతివనాలు, సీసీరోడ్లను చేపట్టి గ్రామాలకు నూతన రూపురేఖలను దిద్దింది మోదీ ప్రభుత్వమేనన్నారు. మోదీ ఇచ్చిన నిధులతో గతంలో కొందరు తామే గ్రామాలను అభివృద్ధి చేశామని చెప్పుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి గ్రామాల అభివృద్ధిపై చిత్తశుద్ది లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మనోహర్, వెంకట్రాములు, నర్సింహ, మహేష్, శ్రీను, తిమ్మారెడ్డి, తిక్కయ్య, కృష్ణ తదిదరులు పాల్గొన్నారు.

బీజేపీ పటిష్టతకు కృషి చేయాలి

మల్దకల్: బీజేపీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు తమవంతు కృషి చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపునకు పాటుపడాలని జిల్లా బీజేపీ ఎన్నికల కన్వీనర్ బలిగేరి నల్లారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. ప్రధాని నరేంద్రమోదీ పేద ప్రజల అభివృద్ధి కోసం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, దామ నాగరాజు, దామ వెంకటేష్, వాసురెడ్డి, కృష్ణారెడ్డి, సాయినాథ్‌రెడ్డి, రాజశేఖర్, రఘు, కిశోర్, ఈరన్నగౌడ్, తిమ్మప్ప, నాగరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మల్దకల్‌లో మాట్లాడుతున్న బలిగేరి నల్లారెడ్డి